# అత్తయ్య ఎవరు?

మళ్ళీ ఇరవైఏళ్ళ తర్వాత మావూళ్ళో అడుగుపెట్టాను. అంతా వింతగా వుంది. నా చిన్నతనంలో యువకులుగా ఉన్నవాళ్ళంతా ముసలివాళ్ళయ్యారు. వాళ్ళ పిల్లలు నాతో ఆడుకున్నవాళ్లు చదువులకోసం, ఉద్యోగాల కోసం దేశాలు పట్టుకునిపోయారు. సుశీలా శ్యామలావాళ్లు భర్తలతో కాపరాలు చేసుకుంటూ పిల్లల తల్లులయ్యారు. కొందరు నన్ను గుర్తుపట్టనేలేదు. మరి కొందరిని నేను గుర్తుపట్టలేకపోయాను.

ఒక్కసారిగా రాధత్తయ్య జ్ఞాపకంవచ్చింది. అవును ఆవిణ్ణి తప్పకుండా చూడాలి. నేనంటే ఆవిడకు చాలా యిష్టం! చిన్ననాటి సంఘటనలు ఏవో కళ్ళకు కట్టినట్టు కన్పించాయి.

అప్పటికి నాకు పదేళ్లు! నే నాడుకుంటూంటే, "కృష్ణుడూ! ఇట్లారా" అని పిల్చేది. ఆ తియ్యని గొంతుకతో పిలిస్తే వెళ్లక మానడం కష్టమనిపించేది.

"ఏం అత్తయ్యా?" అనేవాణ్ణి. వెంటనే మైసూరుపాక్ ముక్కలో, నాలుగు గ్లాస్కో బిస్కట్లో ఒక వెండి పళ్ళెంలో పెట్టి యిచ్చేది. ఆటకు ఆలస్యమవుతుందని నుంచునే తినబోయేవాణ్ణి.

"నీవు బ్రాహ్మణ పిల్లాడివికాదూ? నుంచుని తింటావేం? కూచో" అనేది కఠినంగా. చిరునవ్వు పెదవులమీద నాకు రహస్యంగా కనపడేది.

"వెళ్ళి ఆడుకోవాలి" అని నసుగుతూ మైసూర్‌పాక్‌మీద ఆకర్షణ విడకపోవడంవల్ల కూచునేవాణ్ణి.

రాధమ్మగారు నాకు నిజానికి అత్తయ్యకాదు. పరిచయం మాత్రమే. మా యింటికి మూడోయిల్లు వాళ్లది. మొదటమొదట పేరు పెట్టే పిల్చేవాణ్ణి!

"నాకేం బొడ్డుకోసి పేరు పెట్టలేదు" అంది, ఒకనాడు "రాధమ్మగారూ? అని పిలుస్తే.

"మరి ఏమని పిలవను?"

"అత్తయ్యా? అని పిలువు. అయినా పెద్దవాళ్ళని ఏదో వరసతో పిలవాలిగాని పేరుతో పిలవకూడదు" అంది. ఆనాటినుంచి అలాగే పిలవసాగాను.

వూళ్ళో తక్కిన కుటుంబస్త్రీలతో పోల్చి చూస్తే ఆవిడ ఎంతో ఆకర్షణీయంగానూ, అందంగానూ ఉండేది. ఇల్లూ, చేసేపనీ, దుస్తులూ ప్రతీ విషయంలోనూ ఎంతో శుభ్రతనూ, శ్రద్ధనూ కనబర్చేది. ఆవిడలోని ఏదో ఒక ప్రత్యేకత, చిన్నతనంలోఉన్న నన్ను ఆకర్షించింది.

ఒకరోజు సాయంత్రం ఫలహారం అయింది.

"ఇక వెడతాను" అన్నాను లేచి.

"ఒకమాట. ఇలారా" అంది చేతిని పట్టుకొని. నాచెయ్యి ముఖమల్ గుడ్డని తాకినట్టయింది. దగ్గరగా తీసుకుంది. జడలోని మల్లెపూలు, తలనూనె వాసనా ముఖాని కద్దుకున్న పౌడరు ఇవన్నీ చేరి, నాకు అంత చిన్నతనంలో మత్తు కలిగించాయి.

"ఏం" అన్నాను ఆవిడ తెల్లని ముఖాన్ని అంత దగ్గర్నించీ చూసేను. ఆవిడ ముఖంలో నా ముఖం ప్రతిబింబిస్తుందేమో ననిపించింది. పెద్ద కళ్ళలో నా బొమ్మ స్పష్టంగా కనపడ సాగింది.

"ఈకళ్లు ఎక్కడ సంపాయించావు? కొరికెయ్యాలని వుంది!" నాకు భయమేసి, గుండె కొట్టుకోసాగింది. కొరకదుకద! నామీద చూపుతున్న ఆదరం ఇందుకా. భయంతో కళ్లు మూసుకున్నాను. నెమ్మదిగా కనురెప్పలమీద ముద్దు పెట్టుకుంది. గులాబి పువ్వుతో కళ్ళ కద్దుకున్నట్టయింది.

"కళ్లు తెరవవోయ్" అంది. ఎర్రని పెదిమల్లోంచి పచ్చ కర్పూరం వాసన వొచ్చింది. కళ్లు తెరచాను, భయంగా చూస్తూ.

"నిజంగా కొరికేస్తాననే? ఆమ్మో ఈ వజ్రాలను కొరకడమే?" అంది. నాకు ధైర్యం వొచ్చింది. ఎర్రని పెదిమలకేసి చూడసాగాను.

"ఏం? తమలపాకులు వేసుకుంటావ్?"

"ఊఁ!" అని తలూపాను.

"అమ్మ దొంగా! పెళ్ళికాని పిల్లలు తమలపాకులు వేసుకోకూడదు."

"అయితే మీ యిష్టం."

"అప్పుడే కోపమా? తమ్మివేసుకో" నా పెదిమలకు తన పెదిమలుచేర్చి తమ్మి యియ్య పోయింది.

మూతి బిగించుకుని వొద్దన్నాను.

"మహారాజు లాంటి మొగాడివి సిగ్గేమిటోయ్" అని తమలపాకుల చిలకలూ చెక్కపొడుం ఇచ్చింది. అది చేతులో పడగానే ఉడాయించాను. చేతిలోని పావురం జారిపోయినట్లు కనపడేంతవరకూ చూడసాగింది.

ఒకరోజు మా అమ్మ చూసింది; తమలపాకులు వేసుకుని రావడం.

"ఎక్కడిది?" అంది.

"రాధత్తయ్యగారు ఇచ్చారు" అన్నాను.

"వెధవా! వాళ్ళింటికి ఎందుకు వెడుతున్నావ్? ఈసారి అక్కడికి వెడితే మీనాన్నతో చెప్పి ఏం చేయిస్తానో చూడు" అని భయపెట్టింది.

మరి కొద్దిరోజుల్లోనే ఆవూరు విడిచి వెళ్లిపోయాం. మళ్ళీ ఆవిడ జ్ఞాపకాని కొచ్చింది యిప్పుడే. మాఅమ్మ అలా భయపెట్టడానికి ఆవిడ చేసిన ద్రోహం ఏమిటో నాకు తెలీలేదు. ఆ సమస్య ఇప్పటికీ తీరలేదు.

ఒక స్నేహితుడ్ని అడిగాను "రాధమ్మగారూ వాళ్లు కులాసాగా వున్నారా? ఎక్కడ వున్నారు?" అని.

వాడు సమాధానం చెప్పకుండా నవ్వసాగాడు. నాకు చాలా బాధ కలిగింది. మళ్లీ రెట్టించి అడిగాను.

అతను "ఆమనిషి గొడవెందుకు నీకు?" అన్నాడు, అదేదో అగౌరవమయిన విషయమైనట్టు.

"ఊరికేనే. చిన్నప్పుడు ఎరుగుదును కదా? వాళ్ళ క్షేమం తెలుసుకుందామని" అన్నాను.

"నీకు తెలీదూ. అదంతా ఒక పెద్ద కథలే" అన్నాడు.

"ఏం జరిగిందేమిటి?"

ప్రపంచమంతా తెలుసుకున్న ఆ కథ నాకు తెలీకపోవడానికి ఆశ్చర్యపోతూ ఇలా చెప్పాడు: "అసలు వాళ్ళది చాలా సనాతన కుటుంబం. పెళ్లయిన కొద్దిరోజులవరకు సంసారం నెమ్మదిగా సాగిపోయింది. తర్వాత ఏం జరిగిందో ఎవరికీ తెలీదు. ఏదో చెప్పలేని పరివర్తన వొచ్చింది ఆ కుటుంబంలో. సుదర్శనం ఆస్తినంతటినీ పదేళ్ళల్లో ఆర్పేసింది. ఇంట్లో బోలెడు స్నేహితులు పోగడ్డం, పేకాటలూ, వంటమనిషీ, నౌకర్లూ – ఆ హోదా చెప్పలేం. తర్వాత కొన్నాళ్ళకి అతను చనిపోయాడు. అంతే! ఆవిడజీవితంలో ఒక ఘట్టం గడిచింది. ఇప్పుడు ఆయిల్లు తప్ప యింకేమీ లేదు. ఒకవాటా అద్దెకిచ్చి ఎట్లాగో పొట్ట పోసుకుంటోంది– నేనూ ఒక మనిషినే అంటూ. ఆశ్చర్యం ఏమిటంటే యిన్నేళ్ళు గడిచినా పశ్చాత్తాపం గాని, పరివర్తన గాని ఏమీ లేవు ఆమెలో."

– అతను ముగించాడు. ఆవిడమీద నాకు చెప్పలేని జాలి కలిగింది. ఆమె చేసిన తప్పేమిటో నాకు తెలియకపోయినా, వాడి మాటల్ని నమ్మలేకపోయాను. ఆవిడ చర్యల వెనకాల ఏదో పెద్ద కథ వుండివుంటుంది. అదేదో తెలుసుకోవాలి.

తర్వాత అతనితో సంభాషణ ముగించుకుని, వాళ్ళ యింటివైపు వెళ్ళాను. వీధితలుపు దగ్గరగా వేసివుంది. తలుపు తీసుకుని లోపలికి వెళ్ళాను. ఆవిడ వంటింట్లో ఏదో పని చేసుకుంటోంది.

"రాధత్తయ్యగారూ?" అని పిల్చాను. మెల్లిగా బయటకువచ్చింది. తెల్లనిచీర కట్టుకుని ఉంది. ముఖాన్ని బొట్టులేదు. జడ కూడాలేదు. పెద్దజుత్తుని ముడివేసుకుంది. నా కేకవిని నావైపు ముందుగదిలోకి వచ్చింది. మనిషి కొంచెం లావయింది. ముఖంలో యవ్వనపు ఛాయ, గంభీరత యింకాపోలేదు. కనురెప్పలు భారంతో నల్లబడి ఉన్నాయి. కనుబొమలు తీర్చిదిద్దినట్టు ఇదివరకులానే ఉన్నాయి.

ఒక నిమిషం నన్ను చూసింది.

"మర్చిపోయారా?" అన్నాను.

"నిన్నా? నీ అత్తయ్య నీకింకా జ్ఞాపకం వుందా? అని ఆలోచిస్తున్నాను. కూచో పాపం నిలబడ్డావు. ఇప్పుడు నేనేం టిఫిన్లు పెట్టే స్థితిలోలేను" అంది పాతనవ్వు నవ్వుతూ.

పక్కన ఫేము కుర్చీలో కూర్చున్నాను.

"ఏమోయ్! మీ వారందరూ కులాసాగా ఉన్నారా? నీకు పెళ్ళయిందా? పిల్లలెంత మంది? మీ వాళ్ళని తీసుకువచ్చావా?" ప్రశ్నలవర్షం కురిపించింది.

"మీరు కూడా కూచుంటే గాని, సమాధానం చెప్పను" అన్నాను.

"చిన్నప్పటి పెంకితనం ఇంకా పోలేదే" అంటూ పక్కన చాపవేసుకు కూచుంది. మెడలో రెండుపేటల చంద్రహారం తప్ప ఇంకేమీ లేవు. మనిషి చాలా సాధారణంగా వున్నా, అందం మాత్రం పోలేదు.

మళ్ళీ ఆవిడే అంది: "ఈ పదేళ్ళ జీవితంలోనూ ఇలా నా యింటికి వచ్చి కూచున్నవాళ్లు లేరు. ఎప్పుడో చిన్నతనంలో నీమీద చూపిన ఆప్యాయాన్ని మర్చిపోక నువ్వు నా గుమ్మం తొక్కావు, అంతే! ఈమాట తెలుస్తే నిన్నుకూడా ఈ వూళ్ళో వాళ్ళు గౌరవించరు. నీ ఈ సానుభూతి చాలు. మళ్ళీ ఎవరు చూడకుండా వెళ్ళు. లేకపోతే ఇక్కడ తలెత్తుకు తిరగలేవు." ఈ మాటలు అవంతటవే బయల్వెడలినట్టయింది. గొంతుమాత్రం తియ్యగా, మార్దవంగా వుంది. కళ్ళు కొంచెం చెమ్మగిల్లాయి.

"అవును, మీరు నన్ను హెచ్చరించక్కర్లేదు, ఆ మాటలన్నీవినే, నిజం తెల్సుకుందామని నేను మీ దగ్గరికి వొచ్చాను. మిగతా వాళ్ళతో నాకు సంబంధంలేదు" అన్నాను.

ఆవిడ నిట్టూర్చింది. కొంతసేపు ఏమీ మాట్లాడలేదు. నేను మౌనంగానే కూచున్నాను. తర్వాత చెప్ప సాగింది;

"వాళ్ళ ఉద్దేశంలో నేను కులటను. కాని, నా యథార్థగాథ నీకు చెబుతాను. నిజాన్ని నువ్వైనా అర్థం చేసుకోగలిగితే నా కదేచాలు. నిజంగా నేను వాళ్ళనుకున్నంత ద్రోహచింత గలదాన్నీ, ఆత్మ వంచకురాల్నీ అయితే ఏరోజో ఆత్మహత్య చేసుకుని వుందును. మీ మామయ్య పోయినాక ఈ పదేళ్ళూ ఇలా నిర్జీవినిగా బతక్కపోదును.

"ఎవళ్ళభర్తని వాళ్ళు ప్రేమించడం తప్పా? భర్త ప్రేమకోసం భార్య త్యాగం చెయ్యడం, ఆయనికి అనుకూలంగా నడుచుకుని ఆయన ప్రేమని పొందడం నేరమా? అదే నేను చేసిన తప్పు. దాన్నే అర్థం చేసుకోక, చేసుకునేశక్తిలేక నన్ను దులిపిపోసి, తృప్తిచెందుతున్నారీ పెద్ద మనుషులూ, నీతి పరులూ.

నీకు తెలుసో లేదో గాని, నేను కాపరానికి వచ్చిన రెండేళ్ల వరకూ మీ మామయ్య మొహం ఎరుగనంటే నమ్ము. నేను సనాతన కుటుంబంనించి వొచ్చినమాట నిజమే. నేను పట్నవాసపు వాసనల్ని ఎరగను. ఈ పల్లెటూరి ఆడపిల్లలు, సంస్కార విహీనలు ఎట్లా వుంటారో

నువ్వూ ఎరుగుదువు – భర్తల్ని ఆకర్షించడానికి లెక్కచెయ్యరు. ఎందుకు బ్రతుకుతున్నారో, జీవితాదర్శం ఏమిటో తెలియక జంతువుల్లాగో, అడివిమనుషుల్లాగో, బతుకుతారు. నేనూ అప్పుడు అలాంటి తరగతికి చెందినదాన్నే, ఆరోజుల్లో సినిమాలు, పత్రికలు, నవలలు ఇలాంటివిలేవు, నాగరికతని ప్రచారం చేయడానికి.

బయట ప్రపంచంతో సంబంధం వున్న మీ మామయ్య అంతకంటె ఆకర్షణీయమైన స్త్రీలనీ, విషయాలనీ తెలుసుకున్న ఆయన, వేశ్యాలోలుడవడమే, నన్ను నిర్లక్ష్యంగా చూడడానికి కారణమని ఒకనాడు తెలుసుకోగలిగాను, భారమైన, సంతోషరహితమైన, దుర్భరమైన రెండు సంవత్సరాల తర్వాత. ఆలోచించు మనిషిజీవితంలో, అందులో యవ్వనంలో రెండు సంవత్సరాలు ఎంత విలువైనవో. ఒకనాడు రాత్రి దాసీదాని సహాయంతో ఆ వేశ్యయింటికి మారువేషంతో వెళ్లాను. అదే నా జీవితాన్ని మార్పించి కొన్నాళ్ళయినా సంతోషకరంగా చేసింది. వాళ్లు పురుషుల్ని ఎలా ఆకర్షించేదీ, ఆకర్షణకోసం ఎంత తాపత్రయపడేదీ అన్నీ తెల్సుకున్నాను.

"మానాన్న యిచ్చిన ఏభైరూపాయలుంటే రెండు తెల్లని సిల్కు చీరలూ, టాయిలెట్ సామానులూ, సెంట్లూ, తలనూనెలూ అన్నీ తెప్పించాను. ఒకనాడు భోజనానికి వచ్చిన ఆయన నన్ను గుర్తించలేకపోయేట్టు అలంకరించుకున్నాను. నన్ను ఆవేషంలో చూసిన ఆయన మళ్ళీ పదేళ్ళవరకూ నాకొంగు విడవలేదు. పరస్త్రీముఖం చూడలేదు. అదీ నేను చేసిన ద్రోహం!

"అవొచ్చు. ఆయన సంతోషంకోసం, నా వేషాలకోసం, ఆయన్ని ఆకర్షించడంకోసం, నేను ఆయన ఆస్తినంతనీ ఖర్చుచెయ్యవలసిరావడం నిజమే. అందుకు ఆయన విచారించలేదు. నాకసలేలేదు. "బతికినన్నాళ్లు సుఖంగా బతకాలి. లేనివాటి సంగతి చూసుకుందాం" అనేవారు ఆయన. నేనూ ఆయన్ని సమర్థించినదాన్నే. ఆయన సమ్మతిమీద ఆయన మిత్రులు మాయింటికి పేకాటలకీ, చదరంగానికి వొస్తూండినమాట నిజమే! అంతమాత్రంచేత నేను శీలవతిని కాననడం అన్యాయం కాదూ! అలాగే జరిగివుంటే నేను నన్ను ద్రోహం చేసుకున్నట్టు. నాకంటె ఎక్కువగా ప్రేమించుకున్న నాభర్తని ద్రోహం చేసినట్టు–ఈ భూమి, సూర్యచంద్రులు సాక్షిగా" ముగించి పెద్దగా నిట్టూర్చింది.

"ఈ పరివర్తన మీలో కలిగిన రోజుల్లోనే వచ్చేవాడి ననుకుంటాను నేను. ఒకరోజు మా అమ్మ భయపెట్టిందికూడా" అన్నాను. ఆవిడ 'అవునని' తలూపింది.

"రాధత్తయ్య తక్కినవాళ్ళనుకున్నట్టు లేదు. 'పతివ్రత' అనుకున్నాను, వెళ్ళడానికి లేస్తూ.

*27.10.1950–తెలుగు స్వతంత్ర వారపత్రిక*